# డిజిటల్ పాఠాలతో సత్ఫలితాలు



ఆదిత్య ఎల్-1 లాంచింగ్‌ను ప్రత్యక్ష ప్రసారంలో వీక్షిస్తున్న విద్యార్థులు (ఫైల్)

- సర్కారు బడుల్లో కార్పొరేట్ స్థాయి వసతులు
- శంకరపట్నం మండలంలో ఐదు హైస్కూళ్లలో స్మార్ట్ క్లాసులు
- చదువుపై మరింత ఆసక్తి చూపుతున్న విద్యార్థులు

శంకరపట్నం, డిసెంబర్ 2: ప్రస్తుతం ప్రపంచం టెక్నాలజీ వైపు పరుగులు పెడుతున్నది. ఇదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా స్కూళ్లలో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించగా, విద్యార్థులకు డిజిటల్ బోధనను చేరువ చేసింది. దీంతో బోధన అభ్యసన ప్రక్రియ సులభతరంగా మారింది.

రాష్ట్ర సర్కారు 'మన ఊరు-మన బడి'తో సర్కారు బడుల్లో డిజిటలైజేషన్‌కు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం కింద గత ఆగస్ట్ నెలలో శంకరపట్నం మండలంలోని కన్నాపూర్, మెట్‌పల్లి, కేశవపట్నం, తాడికల్, మొలంగూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలకు స్మార్ట్ క్లాసుల బోధనకు గానూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లను అందజేశారు. రిపబ్లిక్ డే సందర్భంగా డిజిటల్ క్లాసులు ప్రారంభించారు. దీంతో అప్పటి వరకు నిస్తేజంగా సాగిన బోధనాభ్యసన ప్రక్రియలో ఇదో విప్లవాత్మక మార్పు అనే చెప్పవచ్చు. ప్రస్తుతం ఎన్‌సీఈఆర్‌టీ ద్వారా బోధన కొత్త పుంతలు తొక్కుతున్నది. తరగతి గదిలో పాఠ్యాంశాల తాలూకు వీడియోలు, చిత్రాలు స్క్రీన్‌పై ప్రదర్శిస్తున్నారు. ఇందుకు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ మార్పు ఫలితంగా నిష్ణాతులు, సబ్జెక్టు నిపుణుల బోధన ఆడియోలు, వీడియోలు అందుబాటులోకి వచ్చాయి. ఒక్కో పాఠాన్ని పలుమార్లు వినే అవకాశం విద్యార్థులకు లభిస్తోంది. ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌తో పాటు 'దీక్ష' పోర్టల్‌లోని పాఠ్యాంశాలు సైతం బోధిస్తున్నారు. ఇప్పటికే ఉన్న క్యూఆర్ కోడ్ పాఠ్యాంశాలు తీసుకొని వాటిలో కొన్ని మార్పులు, చేర్పులు చేసి ఆడియో, వీడియోలను ప్రదర్శిస్తున్నారు. మన ఊరు-మన బడి కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తుండడంతో విమర్శకుల నుంచి సైతం ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.



కన్నాపూర్ స్కూల్‌లో ఫిజికల్ సైన్స్ పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయురాలు (ఫైల్)

### భిన్న పద్ధతుల్లో సులభంగా బోధించవచ్చు



కన్నాపూర్‌లో గత ఆగస్ట్‌లో 'మన ఊరు-మన బడి' కింద డిజిటల్ లెస్సన్స్ ప్రారంభించాం. ఇప్పటికైతే 8,9, టెన్త్ స్టూడెంట్స్‌కు డిజిటల్ లెస్సన్స్ చెబుతున్నం. దీని ద్వారా సిలబస్ అంతా ఒకేసారి కాపీ, పేస్ట్, డౌన్‌లోడ్ చేసి ఈజీగా బోధిస్తున్నం.. ప్యానెల్స్‌లో స్క్రీన్లను ఎన్నిసార్లైనా మార్చుకునే సౌలభ్యం ఉంది.. గ్రాఫ్స్, మ్యాప్స్‌ను గూగుల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని కూడా బోధించవచ్చు.. ఇక పెన్‌డ్రైవ్‌లు, సీడీల్లో ఉన్న లెస్సన్స్, పీపీటీలను కూడా స్క్రీన్‌పై డిస్‌ప్లే చేసే ఫెసిలిటీ ఉంది. ఇవేకాక యానిమేషన్, డిజిటల్ పిక్చర్స్‌ను కూడా యూజ్ చేసుకోవచ్చు.. అలాగే పేపర్ క్లిప్పింగ్స్ వంటి వాటిని కూడా క్లాస్ రూంలో డిస్‌ప్లే చేయవచ్చు.. లెస్సన్స్‌తో పాటు సబ్ టాపిక్స్‌ను అర్థమయ్యేలా చెప్పవచ్చు.. బ్లాక్ బోర్డ్‌గా వాడడమే కాకుండ వీడియోస్, పిక్చర్స్‌ను ప్లే చేయొచ్చు.. ట్యాబ్‌లలో నోట్ చేసుకున్నట్లుగా టాపిక్స్‌ను రాసుకోవచ్చు. స్క్రీన్ జూమింగ్, టాపిక్స్ వారీగా విడగొట్టి చూపించడం లాంటివి చేయవచ్చు.

*-ఎస్ శ్రీనివాస్, పిజికల్ సైన్స్, కన్నాపూర్ స్కూల్*

### టాపిక్స్ ఈజీగా అర్థం అవుతున్నాయి



డిజిటల్ క్లాసెస్‌తో ఇప్పుడు టాపిక్స్ ఈజీగా అర్థం అవుతున్నాయి. ఈ స్మార్ట్ క్లాసెస్‌తో ఆడియో-విజువల్ ఎయిడ్స్‌ను ఉపయోగించుకోవచ్చు. మేన్లీ ఆప్షనల్ సబ్జెక్ట్స్ అయితే చాలా ఈజీగా నేర్చుకోవచ్చు. కంప్యూటర్, ఇంటర్నెట్, వేర్వేరు ప్రోగ్రామ్స్ ఎక్కువగా యూజ్ చేయడం వల్ల మాకు రెగ్యులర్ చదువులో టెక్నాలజీపై అవగాహన పెరుగుతున్నది.

*- ఏ అశ్విత్, 10వ తరగతి, కన్నాపూర్ స్కూల్*

### లెస్సన్స్ బోర్ కొట్టట్లేదు



మునుపు క్లాస్ రూం లెస్సన్స్ అంటే బోర్ కొట్టేది.. ఇప్పుడు డిజిటల్ క్లాసులతో సబ్జెక్టులపై ఇంట్రెస్ట్ పెరిగింది.. డిజిటల్ క్లాసులతో పాఠాలు భాగా అర్థమవుతున్నాయి. తక్కువ సమయంలో ఎక్కువ విషయాలను నేర్చుకోగలుగుతున్నం. అవగాహన కూడా పెరుగుతున్నది. మ్యాథ్స్, ఫిజిక్స్, సైన్స్ సబ్జెక్టులు చాలా ఈజీగా అర్థం అవుతున్నాయి. స్మార్ట్ క్లాసెస్‌తో గవర్నమెంట్ మాకు చదువుపై ఆసక్తిని పెంచినట్లైంది.

*-కే శివనందన్, 10వ తరగతి, కన్నాపూర్ స్కూల్*

## 'సతీశ్‌కుమార్‌దే విజయం'

సైదాపూర్, డిసెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్ ఘన విజయం సాధిస్తారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య, ప్రధాన కార్యదర్శి చెల్మల్ల రాజేశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని, ప్రజా మద్దతు బీఆర్‌ఎస్‌కే ఉంటుందని పేర్కొన్నారు.

## కొనసాగుతున్న పారిశుధ్య పనులు

చిగురుమామిడి, డిసెంబర్ 2: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు నిర్వహించారు. మండలంలోని చిగురుమామిడి, బొమ్మనపల్లి, ఇందుర్తి, గాగిరెడ్డి పల్లె, రామంచ, రేకొండ తదితర గ్రామాల్లో గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బంది రోడ్లు, మురుగు కాలువల్లో చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేశారు. మురుగు కాలువల వద్ద దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శులు పేర్కొన్నారు.



ఇందుర్తిలో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

## శ్రీనివాస్‌నగర్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు గడ్డం నాగరాజు

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 2: మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో శనివారం మహాలక్ష్మి, భూలక్ష్మి సహిత బొడ్రాయి నెలకొల్పి సంవత్సరం పూర్తి కావడంతో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని గ్రామస్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ప్రత్యేక పూజల్లో బీఆర్‌ఎస్ నాయకుడు గడ్డం నాగరాజు, వివిధ కుల సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కరెంటు మోటర్ చోరీ

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 2: హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని ఇప్పల్‌నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ఆరే రామచంద్రం అనే రైతు బ్రిడ్జి పక్కన ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలువపై ఏర్పాటు చేసుకున్న 5 హెచ్‌పీ కరెంటు మోటర్ శుక్రవారం అర్ధరాత్రి చోరీకి గురైంది. కొన్ని నెలలుగా 5 హెచ్‌పీ మోటర్ పెట్టి పంటలకు నీళ్లు పారించుకుంటుండగా, గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని రైతు శనివారం తెలిపాడు. దాని విలువ రూ.25వేలు ఉంటుందని చెప్పాడు.



రామకృష్ణకాలనీలో కొనుగోలు కేంద్రంలో తూకాన్ని పరిశీలిస్తున్న సెంటర్ ఇన్‌చార్జి కుమార్

# సాఫీగా ధాన్యం కొనుగోళ్లు

- తిమ్మాపూర్ మండలంలో 21 కేంద్రాలు
- ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు
- వారంలోపే డబ్బులు చెల్లింపు

తిమ్మాపూర్, డిసెంబర్ 2: తెలంగాణ ప్రభుత్వ ముందు చూపుతో ధాన్యం కొనుగోళ్లు ఎక్కడా ఇబ్బందుల్లేకుండా సాఫీగా పూర్తి కావస్తున్నాయి. ఎన్నికలు, వరి కోతలు ఒకేసారి రావడంతో రైతులు ఒకింత ఆందోళనకు గురైనా.. ఎన్నికల కోడ్ కూయక ముందే ప్రభుత్వం అధికారులను అప్రమత్తం చేసి సమయానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించింది. వడ్లను ఇబ్బందులు లేకుండా మద్దతు ధర అందిస్తూ కొనుగోలు చేస్తుండగా, సర్కారు సహకారంపై రైతుల్లో హర్షం వ్యక్తమవుతున్నది.

తిమ్మాపూర్ మండలంలో నుస్తులాపూర్, పొరండ్ల సొసైటీలు, డీసీఎంఎస్, ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో 21 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలోని రైతులు ఇతర గ్రామాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రతి గ్రామంలో ధాన్యం సేకరణ ప్రక్రియ చేపట్టారు. నుస్తులాపూర్ సొసైటీ ఆధ్వర్యంలో 13, పొరండ్ల సొసైటీ ఆధ్వర్యంలో 5, డీసీఎంఎస్ 1, ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో 2 కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు.

### మద్దతు ధర..

నుస్తులాపూర్ సొసైటీ ఆధ్వర్యంలో 60వేల క్వింటాళ్లు, పొరండ్ల సొసైటీ ఆధ్వర్యంలో 25వేల క్వింటాళ్లు, ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో 17వేల క్వింటాళ్ల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొన్న వడ్లకు మద్దతు అందిస్తున్నది. ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ.2203, బీ గ్రేడ్ రకానికి రూ.2180 అందిస్తున్నది. కొద్దిగా ఆరబెట్టిన వడ్లను తేమ 17-18 శాతం వస్తే వెంటనే కొనుగోలు చేస్తున్నారు. ఎన్నికలు ఉండడంతో కేంద్రాలు ఎప్పుడు ప్రారంభమవుతాయోనని చాలా మంది రైతులు మిల్లర్లు, దళారులకు అతి తక్కువకు క్వింటాలుకు రూ.1800 నుంచే అమ్ముకున్నారు.

### వారంలోనే ఖాతాల్లోకి డబ్బులు

కొనుగోలు కేంద్రంలో వడ్లు తూకం వేసిన వారం రోజుల్లోపే రైతులకు ప్రభుత్వం డబ్బులు అందజేస్తున్నది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వెంటవెంటనే ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయడంతో రైతుల రైతుబంధు ఖాతాల్లో త్వరగా నగదు జమవుతున్నది. వానకాలం వరి కోతలు పూర్తి కావస్తుండగా.. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం సేకరణ ప్రక్రియ త్వరలోనే ముగియనున్నది.

# చికిత్స కోసం ఎల్‌వోసీలు అందజేత



హైదరాబాద్‌లో నూనె శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ అందజేస్తున్న సముద్రాల సంపత్

శంకరపట్నం, డిసెంబర్ 2: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఇద్దరికి ప్రభుత్వ ఆర్థిక సాయం అందింది. మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన నూనె శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో చేరాడు. ఇతడి చికిత్స కోసం సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ చొరవతో ప్రభుత్వం రూ.2.50 లక్షల విలువైన ఎల్‌వోసీని మంజూరు చేసింది. అలాగే కేశవపట్నం గ్రామానికి చెందిన చెందిన పాశం మల్లయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా, ఇతడికి కూడా రూ. 2.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఎల్‌వోసీలను బాధిత కుటుంబాలకు ఎంపీహెచ్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సముద్రాల సంపత్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్‌తో పాటు ఇందుకు కృషి చేసిన ఎంపీహెచ్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సముద్రాల సంపత్‌కు ఆయా కుటుంబాల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ర్యాలీలకు అనుమతి లేదు

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 2: మానకొండూర్ నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎలాంటి ర్యాలీలు, సమావేశాలకు అనుమతులు లేవని ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మీకిరణ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే మరుసటి రోజు పర్మిషన్ ఉంటేనే విజయోత్సవ ర్యాలీలు నిర్వహించుకోవాలని తెలిపారు. కాగా, మొత్తం 23 రౌండ్లలో కౌంటింగ్ జరుగనుండగా, ప్రతి రౌండ్ రౌండ్‌కు వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.